# మన సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- అధికారికంగా పండుగ నిర్వహించిన ఘనత కేసీఆర్‌దే
- బతుకమ్మ, దేవీ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి
- ఉమ్మడి జిల్లా ప్రజలకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి శుభాకాంక్షలు



సూర్యాపేట టౌన్, అక్టోబర్ 1 : తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి తెలిపారు.. బుధవారం ప్రారంభమయ్యే బతుకమ్మ ఉత్సవాలతోపాటు దేవీ శరన్నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకొనే బతుకమ్మ తెలంగాణ ఉద్యమంలో ఖండంతరాలకు విస్తరించిందని గుర్తుచేశారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మను అధికారికంగా నిర్వహించిన ఘనత ఆనాటి మన ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. ప్రతి బతుకమ్మ పండుగకూ ఆడబిడ్డలందరికీ బతుకమ్మ కానుకగా చీరలు పెట్టి ఆదారాభిమానాలు చాటుకున్నారని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు చెప్పారు.

# నల్ల బ్యాడ్జీలతో ఏఈఓల నిరసన

మోత్కూరు, అక్టోబర్ 1 : రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా వ్యవసాయ విస్తరణ అధికారులు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మండలంలోని పాటిమట్ల రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు రైతునేస్తం కార్యక్రమాన్ని దృశ్య మాద్యమం ద్వారా వినిపించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏఈఓలు జేఏసీ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో హాజరై నిరసన తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వల్ల తమకు పని భారం పెరిగిందన్నారు. డిజిటల్ సర్వే వల్ల అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి వెయ్యి ఎకరాలకు ఒక ఏఈఓను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ వి.కీర్తి, ఏఈఓలు ఎం.అశోక్, టి.గోపీనాథ్, ఎ.వేణు పాల్గొన్నారు.



రైతునేస్తం కార్యక్రమంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఏఈఓలు

# కేటీఆర్‌పై దాడి పిరికిపంద చర్య

- గురువు చంద్రబాబుతో పోటీ పడి దాడులు చేస్తున్న రేవంత్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



కట్టంగూర్, అక్టోబర్ 1 : హైదరాబాద్‌లో హైడ్రా బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి తిరిగి వస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం పిరికిపంద చర్య అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కేటీఆర్‌పై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం నల్లగొండ జిల్లా కట్టంగూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 9 నెలల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులపై, ఖమ్మం వరద బాధితుల వద్దకు వెళ్లిన హరీశ్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడి చేయడం తప్ప ప్రజలకోసం చేసిందేమీ లేదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన నిలబడి పోరాడే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, దానిని జీర్ణించుకోలేక దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై జరిగిన దాడిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులైన వారిని శిక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డీజీపీని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతగాని తనంతోనే ప్రజల్లో తిరుగుబాటు వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి పిచ్చి తుగ్లక్ పాలన చూసి కాంగ్రెస్‌పార్టీ శ్రేణులే తిట్టే పరిస్థితులు నెలకొన్నయన్నారు. దాడులు చేయడంలో తెలంగాణలో రేవంత్‌రెడ్డి, ఆంధ్రాలో చంద్రబాబు పోటీ పడి పని చేస్తున్నారని విమర్శించారు. కేటీఆర్ దాడులకు భయపడే వ్యక్తి కాదని, రాబోయే రోజుల్లో రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లి వారిలో చైతన్యం తెచ్చి మీ పాలనకు చరమగీతం పాడతారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు మానకపోతే రాబోయే రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# ప్రజలకు అండగా ఉంటున్నందుకే కేటీఆర్‌పై దాడి

- నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, అక్టోబర్ 1 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మూసీ బాధితులకు అండగా ఉంటున్నందుకే కాంగ్రెస్ గూండాలు దాడికి దిగారని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. మంగళవారం హాలియాలో మీడియాతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు, ఉడుత ఊపులకు కేటీఆర్ భయపడే వ్యక్తి కాదన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజల చేత ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చి 300 రోజులైనా హామీలను అమలు చేయలేదని విమర్శించారు. పాలనలో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల దృష్టి మరల్చడానికే హైడ్రా పేరుతో కొంతకాలం, మూసీనది ప్రక్షాళన పేరుతో మరికొంత కాలం నాటకాలాడుతున్నారని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో 40 ఏండ్లుగా ఉంటున్న ప్రజల ఇండ్లను కూలగొట్టడం బాధాకరమన్నారు. ఆ ప్రాంతంలో ఇండ్ల నిర్మాణానికి అనుమతిచ్చింది కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. సంవత్సరం లోపే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగి పోయారని, జనం తిరగబడే రోజు త్వరలోనే వస్తుందని పేర్కొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

# పూల పండుగొచ్చె

## నేటి నుంచి బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో...
బంగారు బతుకమ్మ ఉయ్యాలో...
ఒక్కేసి పువ్వేసి చందమామ..
ఒక్క జామాయె చందమామ...
రామ.. రామ.. ఉయ్యాలో...
రామనే శ్రీరామ ఉయ్యాలో...

- తొమ్మిది రోజుల వేడుకకు ఆడబిడ్డలు సిద్ధం
- నేడు ఎంగిలి పూలు

నేరేడుచర్ల, అక్టోబర్ 1: తెలంగాణ ఆడబిడ్డల అతిపెద్ద వేడుక బతుకుమ్మకు వేళ అయ్యింది. బుధవారం ఎంగిలిపువ్వుతో తొమ్మిది రోజుల పూల సంబురం ప్రారంభం కానున్నది. ఇక రోజూ ఊరూవాడ ఉయ్యాల పాటలు హోరెత్తనున్నాయి. తీరొక్క పూలను తెచ్చి, పేర్చి సంతోషంగా బతుకమ్మ ఆడనున్నారు. భాద్రపద బహుళ పంచమి మొదలుకుని మహాలయ అమావాస్య (పితృ అమావాస్య) వరకు ఆడబిడ్డలు బొడ్డెమ్మలు ఆడతారు. అనంతరం బతుకమ్మ పండుగ మొదలవుతుంది. పితృ అమావాస్య నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమై సద్దుల బతుకమ్మతో సంపూర్ణం అవుతాయి. ఈ 9 రోజులు భక్తిశ్రద్ధలతో 9 రకాలుగా బతుకమ్మలను పేర్చి నైవేద్యాలను సమర్పిస్తారు.

మొదటి రోజు.. ఎంగిలిపువ్వు బతుకమ్మ
రెండో రోజు.. అటుకుల బతుకమ్మ
మూడో రోజు.. ముద్ద పప్పు బతుకమ్మ
నాలుగో రోజు.. బియ్యం బతుకమ్మ
ఐదో రోజు.. అట్ల బతుకమ్మ
ఆరో రోజు.. అలిగిన బతుకమ్మ
7ఏడో రోజు.. వేపకాయ బతుకమ్మ
ఎనిమిదో రోజు.. వెన్నముద్దల బతుకమ్మ
తొమ్మిదో రోజు... సద్దుల బతుకమ్మ



నల్లగొండలోని న్యూస్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, టీచర్లు



సూర్యాపేటలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

### బంతి పూలకు భలే గిరాకీ...

ఎంగిల బతుకమ్మ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో బంతి పూలను పెద్దఎత్తున విక్రయానికి ఉంచారు. ఆయా ప్రాంతాలు మహిళలతో సందడిగా కనిపించాయి. నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్, రామగిరి, ప్రకాశం బజార్, దేవరకొండ రోడ్డు, హైదరాబాద్ రోడ్డులో బంతి పూల గిరాకీ బాగా సాగింది.

# సెలవులొచ్చేశాయ్..

- రేపటి నుంచి 14 వరకు పాఠశాలలకు సెలవులు
- ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 6 నుంచి..
- ఎంజీయూ పరిధిలో ఎల్లుండి నుంచి 13 వరకు..
- ఇంటి బాట పటిన విద్యార్థులు



సూర్యాపేటలో కిక్కిరిసిన బస్సు

రామగిరి, అక్టోబర్ 12 : బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి విద్యా సంస్థలకు దసరా సెలవులను ప్రకటించింది. ఈ నెల 14వరకు సెలవులు రావడంతో విద్యార్థుల సంతోషానికి అవధుల్లేవు. హాస్టళ్లలో ఉండే పిల్లలు మంగళవారం సాయంత్రమే ఇంటిబాట పట్టగా, బస్టాండ్లు కిటకిటలాడాయి. ఈ నెల 2 నుంచి అన్ని ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. 2 నుంచి 14వరకు పాఠశాల విద్యాశాఖ సెలవులు ఇవ్వగా, ఇంటర్మీడియట్ బోర్డు మాత్రం ఈ నెల 6నుంచి 13వరకు ఇచ్చింది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ, వాటి అనుబంధంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలలకు ఈనెల 3 నుంచి 13వరకు సెలవులను ప్రకటించారు. పాఠశాలలు ఈ నెల 22న తిరిగి పునఃప్రారంభం కానున్నాయి.



నల్లగొండలో ఇంటికి వెళ్లేందుకు బస్సుల కోసం వేచి చూస్తున్న విద్యార్థులు

# రేపటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

ఈ నెల 12 వరకు వేడుకలు

- విగ్రహాల కొనుగోళ్లు.. ముస్తాబైన మండపాలు
- అమ్మవారి ఆలయాలు ముస్తాబు



నల్లగొండలో ముస్తాబవుతున్న మండపం

రామగిరి, అక్టోబర్ 1: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సిద్ధమయ్యారు. అన్ని ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించేందుకు భక్తులు మండపాలను సిద్ధం చేశారు. ఈ నెల 3 నుంచి 12 వరకు ఉత్సవాలు సాగనుండగా గురువారం మండపాల్లో అమ్మవారు కొలువుదీరనున్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో రాక్‌హిల్స్‌కాలనీలో ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించే ఏర్పాట్లు చేశారు. మరోవైపు దేవీ నవరాత్రి ఉత్సవాలకు నల్లగొండలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. తులసీనగర్‌లోని భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని సరస్వతి, మహాలక్ష్మి ఆలయంతోపాటు పాతబస్తీ భక్తాంజనేయ సహిత సంతోషిమాత గుడి, కలెక్టరేట్ సమీపంలోని అయ్యప్ప దేవాలయంలో గల జ్ఞాన సరస్వతి ఆలయం, పానగల్, హైదరాబాద్ రోడ్డులోని మర్రిగూడ స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

**ఉత్సవాలు ఇలా..**

- తొలి రోజు ఈ నెల 3న బాలాత్రిపురసుందరిగా అమ్మవారు దర్శనం ఇస్తారు. లేత కదంబ పూలు, తెలుపు రంగు చీరతోపాటు నైవేద్యంగా దద్దోజనం సమర్పిస్తారు.
- 4న గాయత్రీదేవిగా దర్శనం ఇస్తారు. చామంతి పూలు, పసుపు రంగు చీరతో పాటు నిమ్మకాయ, రవ్వకేసరి నైవేద్యంగా అందించారు.
- 5న అన్నపూర్ణదేవిగా అమ్మవారు సాక్షాత్కరిస్తారు. గులాబీ పూలు, అదేరంగు చీరతో అలంకరణ చేసి, పులిహోర నైవేద్యంగా సమర్పిస్తారు.
- 6న లలితా త్రిపురసుందరిగా దర్శనం ఇస్తారు. మందార పూలు, పసుపు, గంధం పొడి రంగు చీరతోపాటు పాయసం, తీపి పొంగలి నైవేద్యంగా సమర్పిస్తారు.
- 7న మహాచండీగా అమ్మవారి దర్శనం ఉంటుంది.
- 8న మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చే దుర్గా మాతకు పారిజాతాలు, ఆకుపచ్చ రంగు చీర సమర్పిస్తారు. క్షీరాన్నం నైవేద్యంగా అందిస్తారు.
- 9న సరస్వతీదేవిగా దర్శనం ఇస్తారు. తులసీ దళాలు, గోధుమరంగ చీరతోపాటు రవ్వకేసరి, పాయసం సమర్పిస్తారు.
- 10న దుర్గదేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. కమలం పూలు, తెలుపు రంగు చీరతోపాటు కట్టెలపొంగలి నైవేద్యంగా సమర్పిస్తారు.
- 11న మహిషాసుర మర్దినిగా దర్శనం ఇస్తారు. కనకాంబరం పూలు, ఎరుపు రంగు చీరతో పాటు పులిహోర నైవేద్యంగా అందిస్తారు.
- 12న విజయదశమి రోజున రాజరాజేశ్వరిగా అమ్మవారు దర్శనమిస్తారు. మందార పూలు, నీలం రంగు చీరతోపాటు చక్కర పాయసం నైవేద్యంగా సమర్పిస్తారు.

# డీఎస్సీ అభ్యర్థుల నిరీక్షణ

## మంగళ వారం సాయంత్రం వరకు విడుదల కాని 1:3 జాబితా

డైట్‌లో ఏర్పాటు చేసిన పరిశీలన కేంద్రం అభ్యర్థులు లేక వెలవెల

విద్యాశాఖ, సర్కార్ నిర్వాహకంతో అభ్యర్థుల ఆందోళన

రామగిరి, అక్టోబర్ 1 : ప్రభుత్వం, విద్యాశాఖ నిర్లక్ష్యంతో డీఎస్సీ–2024 అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. ఉపాధ్యాయ పోస్టుల ఫలితాలను సోమవారం విడుదల అవగా.. జిల్లా వారీగా ర్యాంకులు వెల్లడించిన విద్యాశాఖ ఆయా జిల్లాల్లో ఖాళీల ఆధారంగా 1:3 పద్ధతిలో మంగళవారం నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేస్తామని ప్రకటించింది. కానీ, ఎవరు ఎంపిక అయ్యారు అనేది అభ్యర్థులకు మెసేజ్, మెయిల్ పంపలేదు. మంగళవారం సాయంత్రం వరకు కూడా జాబితా విడుదల చేయకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. 1:3 జాబితా ఎప్పుడు వస్తుందని ఉత్కంఠతో ఎదురుచూశారు. రాత్రి 8:20 గంటలకు ఎస్జీటలకు సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ నుంచి జిల్లా విద్యాశాఖకు లింక్ వచ్చినప్పటికీ అది ఓపెన్ అవకపోవడంతో ఇబ్బంది పడ్డారు. రాత్రి 9గంటల వరకు కూడా స్కూల్ అసిస్టెంట్ కేటగిరీకి సంబంధించిన లింక్ రాలేదు.



నల్లగొండలో అభ్యర్థులు లేక ఖాళీగా ఉన్న డైట్ కళాశాలలోని సర్టిఫికెట్ వెరిఫికేషన్ కేంద్రం

### సమాధానం కరువు...

1:3 పద్ధతిలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన మంగళవారం ఉదయం 10గంటల నుంచి ప్రారంభమవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి బి.భిక్షపతి సోమవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మిర్యాలగూడ రోడ్డులో గల డైట్‌లో పరిశీలన కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ మేరకు డైట్‌లో విద్యాశాఖ యంత్రాంగం టెంట్, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించింది. ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేసింది. కాగా, ఎవరి సర్టిఫికెట్లు పరిశీలన చేయాలి, 1:3 అభ్యర్థులు ఎవరనే జాబితా రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేయకపోవడంతో అభ్యర్థులు ఎవరూ హాజరు కాలేదు. కొంతమంది అభ్యర్థులు మాత్రం డైట్‌కు వచ్చి జాబితా ఎప్పుడు వస్తుందని అధికారులను అడగ్గా, వారు సమాధానం చెప్పలేకపోయారు.



నల్లగొండ డైట్ కళాశాలలో ఖాళీగా కుర్చీలు

### కాంట్రాక్ట్ కొర్రీతో ఆసక్తి చూపని 2008 అభ్యర్థులు

- సర్టిఫికెట్ల పరిశీలనకు గైర్హాజరు
- కాంట్రాక్ట్ టీచర్లుగా నియమిస్తామని ప్రభుత్వం చెప్పడంతో అనాసక్తి

రామగిరి, అక్టోబర్ 1: డీఎస్సీ – 2008 అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలన సెప్టెంబర్ 27 నుంచి కొనసాగుతుండగా, ఎక్కువమంది ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 391 మంది అభ్యర్థులను అర్హులుగా ప్రభుత్వం, విద్యాశాఖ ప్రకటించగా, ఇప్పటివరకు 151మంది మాత్రమే తమ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసుకున్నారు. 2008 అభ్యర్థులను కాంట్రాక్ట్ టీచర్స్‌గా మాత్రమే నియమిస్తామని ప్రభుత్వం చెప్పడంతోనే అభ్యర్థులు ముందుకు రావడం లేదు. పరిశీలనలో మంగళవారం సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి ఆర్.రామచంద్రయ్య అధికారులు పాల్గొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఈ నెల 5వరకు అవకాశం ఉంది.

# వయో వృద్ధులను గౌరవించాలి

- జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలకు ప్రత్యేక కౌంటర్
- డిసెంబర్ నాటికి సంక్షేమ భవన్ నిర్మాణం
- వయోవృద్ధుల దినోత్సవంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



వృద్ధురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 1 : సమాజంలో ప్రతి ఒక్కరూ వయోవృద్ధులను గౌరవించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వయోవృద్ధుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. సూర్యాపేట పట్టణంలో వయోవృద్ధుల కోసం నిర్మిస్తున్న సంక్షేమ భవనాన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వయోవృద్ధుల కోసం జిల్లా జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో కొడుకులు పోషించడం లేదని తల్లిదండ్రులు రావడం కలిచి వేసిందన్నారు. ప్రతి శుక్రవారం వయోవృద్ధులు ఆర్డీవో కార్యాలయంలో తమ సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక కమిటీ ఏర్పాటు చేసి వయోవృద్ధుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్ అందరినీ కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీడబ్ల్యూఓ నర్సింహరావు, ఆర్డీఓ వేణు మాదవ్, డీఎస్పీ రవి, వయోవృద్ధుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు, అమీర్ ఖాన్, సత్యనారాయణ, విజయమ్మ, సావిత్రమ్మ పాల్గొన్నారు.

# సీఎం, గవర్నర్ పేషీల్లో ట్రిపుల్ ఆర్ బాధితుల వినతి

చౌటుప్పల్, అక్టోబర్ 1 : చౌటుప్పల్‌లో రీజనల్ రింగ్ రోడ్డులో నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు భూనిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం, గవర్నర్ పేషీల్లో వేర్వేరుగా వినతి పత్రం సమర్పించారు. 28 కిలోమీటర్లు ఉన్న అలైన్‌మెంట్‌ను 40 కిలోమీటర్లకు మార్చాలన్నారు. లేనిపక్షంలో భూమికి బదులు భూమి ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. ఇప్పటికే 65వ నెంబర్ జాతీయ రహదారి, 132కేవీ విద్యుత్ లైన్ తమ భూములను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న కొద్దిపాటి భూమిని ట్రిపుల్ ఆర్ కోసం తీసుకుంటే రోడ్డున పడుతామని వాపోయారు. ప్రభుత్వం మానవీయ కోణంలో తమను ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో బండారు నర్సింహ, కడగంచి చలమంద రాజు, జాల వెంకటేశ్ యాదవ్, సుబ్బారెడ్డి, సురేశ్ యాదవ్, రఘు, వీరేందర్ గౌడ్ ఉన్నారు.



ప్రజాభవన్‌లో వినతిపత్రం ఇస్తున్న భూనిర్వాసితులు